సాక్షి
వనపర్తి
శనివారం । 28 । అక్టోబర్ । 2023



విజ్ఞతతో ఓటు వేద్దాం
ఎన్నికల్లో యువత విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలని విద్యార్థులు అభిప్రాయపడ్డారు.
వివరాలు 10లో ▸



మూగబోనున్న గుడిగంటలు
చంద్రగ్రహణం ఉండటంతో శనివారం మధ్యాహ్నం ఆలయాలు మూసివేయనున్నారు.
వివరాలు 12లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /17.9
వాతావరణం
రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

దిగజారుతున్న కాంగ్రెస్ నాయకులు



వనపర్తి: రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నాయకులు ఎంతకైనా దిగజారుతారని, ఇందుకు రైతుబంధును అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నమే తాజా ఉదాహరణ అని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల కిందట ప్రారంభించిన రైతుబంధు పథకాన్ని వర్తింపజేయవద్దని ఈసీకి కాంగ్రెస్ నాయకులు లేఖలు రాయటం రైతులపై వారికి కొరవడిన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వందేళ్ల వయసు దాటినా.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు రాజకీయ పరిణతి లేకపోవటం దురదృష్టకరమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 11 విడతల్లో రైతుబంధు పెట్టుబడి సాయ ం రైతులకు అందజేసినట్లు మంత్రి వెల్లడించారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతుకు రవాణా ఖర్చు లేకుండా ప్రభుత్వమే మద్దతుధర ఇచ్చి కొనుగోలు చేస్తోందని గుర్తుచేశారు.

బీఆర్‌ఎస్‌లో హైకోర్టు న్యాయవాది చేరిక
హైకోర్టు న్యాయవాది రాధ, మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం పెద్దమందడి మండలం జగత్‌పల్లి విష్ణు ఆధ్వర్యంలో 30 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, పురుషోత్తంరెడ్డి, నాగం తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

జూరాల డీ 6 కాల్వకు గండి



ఆత్మకూర్: పంటలు కోతల సమయంలో సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయని, సాగునీరు వృథాగా పోతున్న అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండల పరిధిలోని జూరాల, గుంటిపల్లి గ్రామాల శివారులోని మూడో కిలోమీటర్ వద్ద జూరాల ప్రధాన ఎడమ కాల్వకు అనుసంధానంగా నిర్మించిన డీ 6 కాల్వకు గండి పడిన విషయాన్ని రైతులు గమనించారు. జూరాల అధికారులు యాసంగి సీజన్‌లో సమస్యలు గుర్తించకపోవడంతోనే ప్రతి ఏడాది వానాకాలం సీజన్‌లో కాల్వకు గండ్లు పడుతున్నాయని రైతులు వాపోతున్నారు.

24 గంటల్లో సమస్య పరిష్కారం..
జూరాల ప్రధాన ఎడమ కాల్వకు అనుసంధానంగా నిర్మించిన డీ 6 కాల్వ పరిధిలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు వరద ఉధృతి సామర్థ్యానికి మించి నీరు విడుదల చేస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని జూరాల ఎస్‌ఈ సత్యశీలరెడ్డి అన్నారు. మరమ్మతులో భాగంగా ఇదివరకే నీటి విడుదల నిలిపివేశామని 24 గంటల్లోగా గండ్లకు మరమ్మతు చేపట్టి పంటలకు సాగునీరు అందిస్తామని, రైతులు ఆందోళన చెందన వసం లేదన్నారు.

మంత్రి పీఆర్‌ఓపై కేసు నమోదు

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు మేరకు..

వనపర్తి: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారన్న ఫిర్యాదు మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి పీఆర్‌ఓ సందీప్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం రాత్రి ఎస్పీ రక్షితా కె.మూర్తి తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా నిబంధనలను అతి క్రమించి వాట్సాప్ గ్రూపుల్లో ప్రకటనలు పోస్టు చేశారని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి యాదగిరి వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఏపీఎం, సీసీలపై కూడా..
ఈ నెల 26న వనపర్తిలో నిర్వహించిన పార్టీ సమావేశానికి నిబంధనలను ఉల్లంఘించి బీఆర్‌ఎస్ ప్రతినిధులతో కలిసి బస్సులలో మహిళలను తరలించారని శ్రీరంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మండల తహసీల్దార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మురళి ఫిర్యాదు మేరకు ఏపీఎం వెంకటేష్, సీసీలు సువర్ణ, రహీంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ చెప్పారు.

● ఆల్ క్లియర్..!

ఉత్కంఠకు తెర..

కాంగ్రెస్ రెండో జాబితా విడుదల
- పెండింగ్‌లోని 6 స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన
- మొత్తం 14 అసెంబ్లీ సెగ్మెంట్లకు అభ్యర్థిత్వాలు ఖరారు
- ఉమ్మడి పాలమూరులో హోరెత్తనున్న ప్రచారం
- ఎర్ర శేఖర్, కొత్వాల్, మేఘారెడ్డికి భంగపాటు
- వారి దారెటు అని రాజకీయ వర్గాల్లో చర్చ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారుపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్రవ్యాప్తంగా 45 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటిస్తూ పార్టీ అధిష్టానం శుక్రవారం రాత్రి రెండో జాబితా విడుదల చేసింది. ఉమ్మడి పాలమూరుకు సంబంధించి తొలి విడతతో ఎనిమిది స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయగా.. తాజాగా పెండింగ్‌లోని ఆరు స్థానాల్లో సైతం ప్రకటించారు. అన్ని స్థానాల్లోనూ బరిలో నిలిచే 'హస్తం' అభ్యర్థులపై స్పష్టత రాగా.. నేటినుంచి ప్రచారం హోరెత్తనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశించిన పలువురి నేతలకు భంగపాటు ఎదురు కాగా.. వారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

తొమ్మిది.. మూడు.. రెండు
ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో 12 జనరల్ కాగా.. రెండు (అచ్చంపేట, అలంపూర్) ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు. తొలి, రెండో విడత అంత కలుపుకుని పరిశీలిస్తే రెండు రిజర్వ్‌డ్ స్థానాల్లో ఇద్దరు ఎస్సీ అభ్యర్థులను మినహాయించి.. మిగిలిన 12 స్థానాల్లో ఎనిమిది మంది రెడ్డి, ఒకరు వెలమతో పాటు బీసీ వర్గాలకు చెందిన ముగ్గురికి అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.

ఇక హోరాహోరీ ప్రచారం..
అధికార బీఆర్‌ఎస్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను నెలన్నర క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే. అలంపూర్ మినహా మిగతా అభ్యర్థులందరికీ సీఎం కేసీఆర్ బీఫాంలు సైతం అందజేశారు. ఈ మేరకు అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. తాజాగా అన్ని స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారైన నేపథ్యంలో ప్రచారం హోరెత్తనుంది.

తొలిసారి పోటీలో ఆరుగురు..
మొదటి జాబితాలో ప్రకటించిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేష్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), జెడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య (గద్వాల)తో పాటు రెండో జాబితాలో ప్రకటించిన చిట్టెం పర్ణికారెడ్డి (నారాయణపేట), అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల), జి.మధుసూదన్‌రెడ్డి (దేవరకద్ర), వాకిటి శ్రీహరి (మక్తల్) తొలిసారిగా అసెంబ్లీ బరిలో నిలుస్తున్నారు.

కాంగి'రేసు'లో వీరే..

	నియోజకవర్గం	అభ్యర్థి
తొలి జాబితా	కొడంగల్	ఎనుముల రేవంత్‌రెడ్డి
	నాగర్‌కర్నూల్	కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి
	కొల్లాపూర్	జూపల్లి కృష్ణారావు
	కల్వకుర్తి	కసిరెడ్డి నారాయణరెడ్డి
	అచ్చంపేట	చిక్కుడు వంశీకృష్ణ
	షాద్‌నగర్	వీర్లపల్లి శంకర్
	గద్వాల	సరితా తిరుపతయ్య
	అలంపూర్	ఎ.సంపత్‌కుమార్
రెండో జాబితా	నారాయణపేట	చిట్టెం పర్ణికారెడ్డి
	మహబూబ్‌నగర్	యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
	జడ్చర్ల	అనిరుధ్‌రెడ్డి
	దేవరకద్ర	జి.మధుసూదన్‌రెడ్డి
	మక్తల్	వాకిటి శ్రీహరి
	వనపర్తి	జిల్లెల చిన్నారెడ్డి

మక్తల్ ఎమ్మెల్యే సోదరుడి కూతురే పర్ణికారెడ్డి
2005 సంవత్సరంలో నారాయణపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తూ మావోయిస్టుల కాల్పుల్లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి, ఆయన తనయుడు పీసీసీ సభ్యుడు చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి మృతిచెందిన విషయం తెలిసిందే. చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి కూతురైన డాక్టర్ పర్ణికారెడ్డి నారాయణపేట నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుంభం శివకుమార్‌రెడ్డికి ఆమె స్వయానా మేనకోడలు. అదేవిధంగా బీఆర్‌ఎస్ మక్తల్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సోదరుడి కుమార్తె. అలాగే బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు సైతం మేనకోడలు అవుతుంది.

మేఘారెడ్డి, ఎర్రశేఖర్, కొత్వాల్, ప్రదీప్‌కు భంగపాటు
కాంగ్రెస్ తొలి విడత తర్వాత పెండింగ్‌లో పెట్టిన ఆరు స్థానాల్లో ఇద్దరికి మించి అభ్యర్థులు పోటీ పడుతుండడం.. సామాజిక వర్గ సమీకరణలు తలనొప్పిగా మారిన విషయం తెలిసిందే. పలు దఫాలుగా ముఖ్యనేతలు సమావేశమవడం.. ఆశావహులతో మాట్లాడుతూ అసమ్మతి లేకుండా అధిష్టానం ఆచితూచి వ్యవహరించింది. ఈ క్రమంలో రెండో జాబితాలో పెండింగ్‌లోని రెండు, మూడు స్థానాల్లో అభ్యర్థులను మాత్రమే ప్రకటిస్తారని అంతా ఊహించారు. అయితే మిగిలిన అన్ని స్థానాల్లోనూ అభ్యర్థులను ప్రకటించడం జిల్లాకు చెందిన పార్టీ నేతలను నివ్వెరపరిచింది. రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే పాలమూరే కీలకమని భావించిన పెద్దలు దూకుడుగా వ్యవహరించినట్లు భావిస్తున్నారు. కాగా, టికెట్ ఆశించిన మేఘారెడ్డి (వనపర్తి), ఒబేదుల్లా కొత్వాల్ (మహబూబ్‌నగర్), కాటం ప్రదీప్ కుమార్‌గౌడ్ (దేవరకద్ర)కు ఆశాభంగమే ఎదురైంది. ఇప్పటివరకు వారు ఏ నిర్ణయం ప్రకటించకున్నా.. వారి దారెటు అనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

■ జడ్చర్ల లేదా నారాయణపేటలో ఏదో ఒక స్థానం నుంచి టికెట్ వస్తుందని ఆశపడిన ఎర్రశేఖర్ భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నాడు. శుక్రవారం జడ్చర్లలోని తన నివాసంలో చర్చించి.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తామని వెల్లడించారు.

అగ్రనేతలొస్తున్నారు..

- పాలమూరు మీదుగా కాంగ్రెస్ 2వ విడత బస్సు యాత్ర
- 31న కొల్లాపూర్‌కు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ
- నవంబర్ 1న కల్వకుర్తి, జడ్చర్ల, షాద్‌నగర్‌లో పర్యటన
- 3 చోట్ల కార్నర్ మీటింగ్‌లు.. హస్తం శ్రేణుల్లో జోష్





సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వచ్చే ఎన్నికల్లో గెలుపొందడమే లక్ష్యంగా కాంగ్రెస్ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ మేరకు అగ్రనేతలను రంగంలో దింపుతోంది. తొలి విడతలో ఉత్తర తెలంగాణ జిల్లాలో చేపట్టిన బస్సు యాత్రలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతో పాటు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తదితర కీలక నేతలు పాల్గొన్న విషయం తెలిసిందే. తాజాగా దక్షిణ తెలంగాణలో రెండో విడత బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి పాలమూరు మీదుగా సాగే యాత్రలో రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తదితర నాయకులు ఈ నెల 31న కొల్లాపూర్, వచ్చే నెల ఒకటో తేదీన కల్వకుర్తి, జడ్చర్ల, షాద్‌నగర్‌లో పర్యటించనున్నారు. కొల్లాపూర్, కల్వకుర్తి, జడ్చర్లలో కార్నర్ మీటింగ్ నిర్వహించనుండగా.. అగ్రనేతలు ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ విడుదలైంది. తాజాగా పాలమూరులోని అన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించడం.. అగ్రనేతలు జిల్లాకు రానుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

కార్నర్ మీటింగ్‌లు ఇలా..

తేదీ	నియోజకవర్గం	యాత్ర, కార్నర్ మీటింగ్
అక్టోబర్ 31	కొల్లాపూర్	సా. 4.30 - రా.7.30
నవంబర్ 1	కల్వకుర్తి	ఉ.10.00 - మ.12.00
	జడ్చర్ల	సా.5.00 - సా.6.00
	షాద్‌నగర్	సా.6.40 - రా.7.30

జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా

- ప్రతి వాహన తనిఖీ తప్పనిసరి
- ఎస్పీ రక్షిత కె.మూర్తి


నాగల్‌కడ్మూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో ఎస్పీ రక్షిత కె.మూర్తి

అమరచింత/ఆత్మకూర్: ఎన్నికల కోడ్‌లో భాగంగా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, పటిష్టంగా నిఘా పెంచుతూ వాహనాల తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో, నారాయణపేట జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు చెక్‌పోస్టు వద్ద ఉన్న రికార్డును పరిశీలించి వాహనాలను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా జిల్లా సరిహద్దులో ఈ సారి ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద గురువారం నాటికి రూ.1,28,06,179 నగదు, చీరలు, 35.4 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటి వరకు ఎన్ని వాహనాలు తనిఖీ చేశాం.. వాహనాల నంబర్లు, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారు అనే వివరాలను రిజిష్టర్‌లో తప్పనిసరిగ్గా నమోదు చేస్తున్నామని వెల్లడించారు.
⇨ ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బులతో పాటు మద్యం తరలిస్తున్నారని, వీటిని నియంత్రించడానికి జిల్లాలోని సరిహద్దుల్లో ఇప్పటికే ఆరు ప్రదేశాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. పలు ప్రాంతాల్లో మరిన్ని పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి..
శాసనసభ ఎన్నికల ఓటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి పరిసరాలను పరిశీలించారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల వివరాలను సేకరించామన్నారు.

జిల్లా కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్

వనపర్తి: ఎన్నికలపై ప్రజలకు విశ్వాసం కల్గించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ రక్షితా కె. మూర్తి వారితో పాటు కవాతు చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేలా ప్రజలు వారి ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకుంటామని నమ్మకం కలిగేందుకు పోలీస్‌శాఖ కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు ఎస్పీ వెల్లడించారు. స్థానిక పాలిటెక్నిక్ కాలేజ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై వివేకానంద చౌరస్తా, టౌన్ పోలీస్‌స్టేషన్, శంకర్‌గంజ్, గాంధీ చౌక్, గాంధీ నగర్, మారెమ్మ కుంట, అంబేద్కర్ చౌక్, రాజీవ్ చౌక్, బస్‌డిపో మీదుగా టౌన్‌హాల్ వరకు కవతు కొనసాగింది. వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, కేంద్ర సాయుధ బలగాల అసిస్టెంట్ కమాండెంట్స్ రాబిన్, ప్రమోద్ జా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, సీఐలు మహేశ్వర్ రావు, శ్రీనివాస్‌రెడ్డి, రత్నం కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

అభివృద్ధే 'మంత్రం'

- కొల్లాపూర్ అభ్యర్థుల మనోగతం

రాజకీయ చైతన్యం.. ఊహించని తీర్పునకు కేరాఫ్‌గా నిలుస్తోంది కొల్లాపూర్ నియోజకవర్గం. 75 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్లు ఉన్న ఈ సెగ్మెంట్‌లో అగ్రవర్ణ నేతలదే హవా. ఇప్పటివరకు ఒక ఉప ఎన్నికతో సహా మొత్తం 16 పర్యాయాలు ఎన్నికలు జరగ్గా 11 దఫాలు వెలమ, 3 సార్లు రెడ్డి, రెండు పర్యాయాలు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. తొలి ఎమ్మెల్యే కమ్యూనిస్టు అభ్యర్థి కాగా.. మూడు పర్యాయాలు స్వతంత్రులు విజయం సాధించారు. ప్రజల విలక్షణ శైలి అంతుబట్టని ఈ సెగ్మెంట్‌లో ఇటీవల రాజకీయ పరిణామాలు వేగంగా మారగా.. ఈ దఫా ఎన్నికలు మరింత కాక పుట్టిస్తున్నాయి. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఖరారు కాగా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ మంత్రంతో బీరం హర్షవర్ధన్‌రెడ్డి, హామీ ఇవ్వను.. అభివృద్ధి చేసి చూపిస్తానని జూపల్లి కృష్ణారావు, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతానని ఎల్లేని సుధాకర్ రావు చెబుతున్నారు. రాజుల కోటలో ఆయా నేతల ఎజెండా, హామీలు వారి మాటల్లోనే..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

జంగ్ తెలంగాణ

● మా ఎజెండా

బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి



కరోనా కష్టకాలం ముగిశాక మూడేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. వేర్వేరు కారణాల వల్ల కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఎన్నికల్లో గెలిస్తే పెండింగ్ పనులన్నింటినీ పూర్తిచేస్తా. నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడే కొత్త పనులకూ శ్రీకారం చుడతా.

హామీలు..
- కొల్లాపూర్‌ను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతా. మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తా. నవోదయ, కేంద్రీయ పాఠశాల, బీసీ డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల, చిన్నంబావి, పెంట్లవెల్లి మండలాల్లో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయిస్తా.
- టీఎస్‌బీపాస్ ద్వారా కొల్లాపూర్‌లో పరిశ్రమలతో పాటు ఫ్రూట్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా.
- కృష్ణా తీర ప్రాంతాలను హెల్త్ టూరిజంగా డెవలప్‌మెంట్ చేస్తా.
- 167కే జాతీయ రహదారి తీసుకొచ్చా. అచ్చంపేట నుంచి అలంపూర్ వరకు చిన్నంబావి మీదుగా జాతీయ రహదారిని మంజూరు చేయిస్తా.
- నియోజకవర్గంలో కొత్తగా మరో 3 మండలాలు ఏర్పాటు చేయిస్తా.
- కొల్లాపూర్‌లో డివిజన్ స్థాయి కార్యాలయాలన్నీ ప్రారంభమయ్యేలా చూస్తా. వీపనగండ్ల మండలంలో సర్కిల్ కార్యాలయం, చిన్నంబావిలో కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తా.
- శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం జీఓ ఇచ్చింది. కలెక్టర్ల వద్ద ఈ నివేదికలు ఉన్నాయి. పూర్తి స్థాయిలో నిర్వాసితులందరికీ ఉద్యోగాలు వచ్చేలా చూస్తా.
- రంగదాసు జీల్‌దార్ తిప్ప చెరువుకు కృష్ణా నీటి తరలింపు, బాచారం హైలెవెల్ కెనాల్, పసుపుల బ్రాంచి కెనాల్, సింగోటం–గోపాల్‌దిన్నె లింక్ కెనాల్ వంటి పనులన్నీ ఏడాదిలో పూర్తి చేయిస్తా.

ఎల్లేని సుధాకర్ రావు, బీజేపీ అభ్యర్థి



కొల్లాపూర్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకున్నా. నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే 167కే జాతీయ రహదారి సాధించిన తరహాలోనే మిగతా అభివృద్ధి పనులు చేసి చూపిస్తా. నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధించేలా కృషి చేస్తా.

హామీలు..
- కొల్లాపూర్‌ను పారిశ్రామిక జోన్‌గా తీర్చిదిద్దుతా. కనీసం వంద పరిశ్రమలు తీసుకొస్తా. 10 వేల మందికి ఉపాధి కల్పిస్తా.
- కేంద్రాన్ని ఒప్పించి కొల్లాపూర్ మీదుగా జాతీయ రహదారిని తీసుకొచ్చా. అదే పట్టుదలతో రైల్వేలేన్ కూడా తెస్తా.
- విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతా. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ఆధునికీకరిస్తా.
- మామిడి రైతుల కోసం మార్కెటింగ్ పరిశ్రమలు తీసుకొస్తా. మామిడి ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేయిస్తా.
- అన్ని గ్రామాలకు రహదారులు నిర్మిస్తా. దెబ్బతిన్న రోడ్లను బాగు చేయిస్తా.
- పర్యాటక ప్రాంతాలను అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. కృష్ణానది తీర ప్రాంతాల్లో పర్యాటకుల కోసం వసతులను మెరుగుపరుస్తా.
- యువతకు ఉద్యోగాల కల్పనలో భాగంగా అవసరమైన శిక్షణకు కేంద్రాలు ఏర్పాటు చేయిస్తా.
- మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు అవసరమైన సహకారం అందిస్తా.

జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ అభ్యర్థి



నియోజకవర్గంలో నా హయాంలో జరిగిన అభివృద్ధే కనిపిస్తోంది. గతంలో నేను మంజూరు చేయించిన పనుల్లో కొన్నింటినే పూర్తి చేశారు. నేను ముందస్తు హామీలు ఇవ్వను. గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా.

అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలి


గోపాల్‌పేట మండలంలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి/గోపాల్‌పేట: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ పవార్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు వనపర్తి, గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అక్కడ ప్రస్తుతం ఉన్న సదుపాయాలు, కల్పించాల్సిన మౌలిక వసతులపై అధికారులకు సూచనలు చేశారు. స్థానిక బాలికల పాఠశాల, హరిజన వాడ ఉన్నత పాఠశాల,తాడిపర్తి ప్రాథమికోన్నత పాఠశాల, గోపాల్‌పేట జెడ్పీహైస్కూల్, బుద్ధారం ప్రాథమిక, ఉన్నత పాఠశాల, పాలికేపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, తల్పునూర్ జెడ్పీహైస్కూల్, రేవెల్లి జెడ్పీ హైస్కూల్, ఏదుల ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన ర్యాంపులు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం తదితర ఏర్పాట్లు పరిశీలించారు. జిల్లాలో ఎక్కడైనా ఏవైనా సౌకర్యాలు లేకుంటే తక్షణమే ఏర్పాట్లు చేసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించినప్పుడు ఆయా పాఠశాలల్లోని విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు.

సీఎంఆర్ బియ్యం ఎఫ్‌సీఐకి అప్పగించాలి
ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం విషయంలో నిర్లక్ష్యం వహించే మిల్లర్లపై చర్యలు తప్పని కలెక్టర్ తేజస్ పవార్ సూచించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావుతో కలిసి మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సుమారు 56 మిల్లర్లు ఇప్పటి వరకు ఎఫ్‌సీఐకి కనీసం ఒక్క క్వింటాలు బియ్యం కూడా ఇవ్వకపోవటం ఏమిటని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో 158 రైస్ మిల్లులు ఉండగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను 1,71,682 మెట్రిక్ టన్నుల బియ్యంను ఇచ్చేందుకు లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పటి వరకు కేవలం 20 శాతం(34,988 మెట్రిక్ టన్నుల) బియ్యం మాత్రమే ఎఫ్‌సీఐకి అప్పగించినట్లు తెలిపారు. మిగతా బియ్యం నెల రోజుల వ్యవధిలో అప్పగించాలన్నారు.

బడిఈడు పిల్లలతో పనిచేయిస్తే చర్యలు
బడిఈడు చిన్నారులతో పనిచేయిస్తే.. చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ పవార్ అన్నారు. పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా గోపాల్‌పేట మండలం పాల్కెపహాడ్, బుద్దారం గ్రామాల మధ్యలో పత్తిచేనులో చిన్నారులు పనిచేస్తున్న విషయాన్ని గమనించారు. కలెక్టర్ వారితో మాట్లాడారు. పాఠశాలకు వెళ్లకుండా పని ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంటి వద్ద ఉంటే అల్లరిచేస్తారని, పొలం వద్దకు తీసుకొచ్చానని చిన్నారుల తల్లి కలెక్టర్‌కు తెలియజేసింది. చిన్నారులు చదువుపై శ్రద్ధ చూపించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

ఆ ఇద్దరు హ్యాట్రిక్ వీరులు!



రాంచందర్‌రావు కల్యాణి ఎల్కొటి ఎల్లారెడ్డి

నారాయణపేట: నారాయణపేట, ఊట్కూర్ ప్రాంతానికి చెందిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు హ్యాట్రిక్ వీరులు కావడమే కాకుండా.. మార్కెటింగ్ శాఖ మంత్రులుగా పదవులు నిర్వహించారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నారాయణపేట 2009లో సెగ్మెంట్‌గా ఏర్పడింది. అంతకుముందు మక్తల్ సెగ్మెంట్ పరిధిలో ఉండేది. 1958లో నారాయణపేట మున్సిపాలిటీ చైర్మన్‌గా ఎన్నికైన స్వాతంత్య్ర సమరయోధుడు రాంచందర్‌రావు కల్యాణి 1962లో కాంగ్రెస్ తరఫున మొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1967లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందారెడ్డి హయాంలో మార్కెటింగ్‌శాఖ మంత్రిగా పనిచేశారు. 1972లో జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ నుంచి ముచ్చటగా మూడోసారి ఏకగ్రీవంగా ఎమ్మెల్యే అయ్యారు. మక్తల్ నియోజకవర్గం నుంచి 1994 ఎన్నికల్లో ఎల్కొటి ఎల్లారెడ్డి టీడీపీ నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1995లో ఎన్టీఆర్‌ను సీఎం పదవి నుంచి దించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగా.. ఆయన హయాంలో ఎల్కొటి ఎల్లారెడ్డి మార్కెటింగ్‌శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 1999లో జరిగిన ఎన్నికల్లో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో నారాయణపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ ప్రాంతం నుంచి గెలిచిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు హ్యాట్రిక్ సాధించడంతో పాటు మార్కెటింగ్‌శాఖ మంత్రులుగా పని చేయడం విశేషంగా చెప్పవచ్చు.

విజ్ఞతతో ఓటు వేద్దాం

- సమర్థ నాయకుడి ఎన్నికతోనే సుపరిపాలన
- ఎన్నికల్లో ప్రలోభాలకు గురికావొద్దు
- విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాలి
- 'ఓటుపై అవగాహన–నాయకుడి ఎన్నిక' సదస్సులో విద్యార్థుల మనోగతం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యువత విజ్ఞతతో ఓటు వేయాల్సిన అవసరం ఉందని పలువురు విద్యార్థులు స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తిరుమలహిల్స్ వద్ద ఉన్న రిషి కళాశాలలో శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఓటుపై అవగాహన–నాయకుడి ఎన్నిక అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేయగా.. కళాశాల విద్యార్థులతో పాటు ఐఐటీ, నీట్ అకాడమీ విద్యార్థులు తమ మనోగతాన్ని వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, ఎన్నికల్లో ప్రలోభాలకు గురికాకుండా సమర్థ నాయకుడిని ఎన్నుకోవాల్సిన బాధ్యత అందరిపై స్పష్టం చేశారు. వచ్చే ప్రభుత్వాలు సమాజంలో పూర్తిగా బాల్యవివాహాలు, భ్రూణహత్యలను నిర్మూలించాలని.. ప్రతి విద్యార్థికీ పేద, ధనిక తేడా లేకుండా మెరుగైన విద్య అందించాలని కోరారు.


ఓటు అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

జంగ్ తెలంగాణ

ఓటుతో జీవితాలు మారుతాయి..


ఎన్నికల్లో నాయకులు ఇచ్చే డబ్బు, మద్యం తీసుకోకుండా నిజాయితీగా ఓటువేయాలి. రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు. అవగాహన ఉన్న వారు, చదువుకున్న వారు విజ్ఞతతో వేసే ఓటు ఎంతో మంది జీవితాలను మారుస్తుంది. ప్రలోభాలకు లోనైతే నాయకులు గెలిచాక ప్రజలకు న్యాయం చేయరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. – ఎం.జాహ్నవి

యువత ఆలోచించి ఓటు వేయాలి..


ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు అభ్యర్థులు అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తుంటారు. యువత ఆలోచించి ఓటు వేయాల్సిన అవసరం ఉంది. వచ్చే ప్రభుత్వాలు రిజర్వేషన్‌లను క్రమంగా తగ్గించాలి. వీటి వల్ల కులం, మతం, వర్గం వంటివి సమాజంలో విస్తృతమవుతున్నాయి. ప్రజల మధ్య అంతరాలు తగ్గాలంటే వీటిని తగ్గించాలి. – నివేదిత

విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి..


ప్రస్తుతం నాయకులు విద్య, ఉపాధి, వైద్యం వంటి అంశాలపై ఎవరూ మాట్లాడటం లేదు. కేవలం ఉచితాల గురించి మాట్లాడుతున్నారు. దీని వల్ల ఎవరికి లాభం లేదు. వ్యవస్థలో మార్పు రావాలంటే ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి, పూర్తి స్థాయిలో వసతులు కల్పించే వారిని ఎన్నుకోవాలి. – లావణ్య శ్రీజసాయి

గతంలో తప్పిదం చేస్తే ఓటు వేయవద్దు


ఒకసారి ఎన్నికల్లో గెలిచాక ప్రజలకు న్యాయం చేయని వ్యక్తులకు ఎటువంటి పరిస్థితుల్లో రెండో సారి ఓటువేసి గెలిపించకూడదు. ప్రభుత్వాలు, నాయకుల గత చరిత్రను పరిగణలోకి తీసుకుని ఓటు వేయాలి. ప్రలోభాలకు గురిచేసే వారికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది. – నవ్యశ్రీ

మెరుగైన, వివక్ష లేని విద్యకావాలి


సమాజంలో ప్రతి వ్యక్తికీ విద్య కచ్చితంగా అందించాల్సిన అవసరం ఉంది. ఇందులో పేద, ధనిక తారతమ్యాలు లేకుండా అందరికీ సమానంగా విద్య అందేలా చూడాలి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తే సమాజంలో మార్పు వస్తుంది. – జోహా ఫజల్‌ఖాన్

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి


మనిషికి ప్రాథమికంగా విద్య , వైద్యం చాలా ప్రధానం. వీటిని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచితంగా అందించాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్ల కేటాయింపులు, కులం ఆధారంగా కాకుండా, ప్రతి వ్యక్తి ఆర్థిక స్థితి ఆధారంగా అందించాలి. – రచన

ఉపాధి అవకాశాలు కల్పించాలి..


చాలా మంది ఉన్నత చదువులు చదివినా అందుకు తగ్గ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఖాళీగా ఉంటున్నారు. చదివితే జీవితం మారదు.. ఉద్యోగం వస్తే మారుతుంది. చదువు పూర్తయిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. – అక్షయ

సమర్థ నాయకుడిని ఎన్నుకోవాలి..


వచ్చే ఎన్నికల్లో సమర్థ నాయకుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉంది. డబ్బు, మద్యం పంచే వారిని విద్యావంతులు వ్యతిరేకించాలి. జిల్లా కేంద్రంలోని ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చాలా గొప్ప విషయం. భవిష్యత్‌లో మరిన్ని కళాశాలలు తీసుకొచ్చే వారిని ఎన్నుకోవాలి. – హబీలియా ఫైసీ

ఒత్తిడి లేని విద్య తీసుకురావాలి..


మారుతున్న విద్యావ్యవస్థలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులపై మానసిక ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వాలు ఈ విధానాన్ని మార్చాలి. వచ్చే ఎన్నికల్లో డబ్బులు ఇచ్చి ప్రలోభాలకు గురిచేసే వారికి ఓటు వేయకుండా యువత బాధ్యత తీసుకోవాలి. – అక్షిత

బాల్యవివాహాలను నిర్మూలించాలి..


ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో బాల్యవివాహాలు చేయడం చాలా బాధాకరం. బాలికలు పుడితే చంపివేసే ఘటనలను తరచూగా చూస్తుంటాం. చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేసి ఆడపిల్లలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వచ్చే ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. – సనాసుల్తానా

కాంగి'రేసు' గుర్రాలు

నారాయణపేట - నియోజకవర్గం

పేరు : చిట్టెం పర్ణికారెడ్డి
పుట్టిన తేదీ : 20.08.1993
చదువు : ఎంబీబీఎస్ (ఎండీ రేడియాలజిస్ట్)
తండ్రి : దివంగత చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి
తల్లి : చిట్టెం లక్ష్మి ఐఏఎస్ (రాష్ట్ర అడిషనల్ కార్యదర్శి సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్)
రాజకీయ నేపథ్యం : మొదటి నుంచి చిట్టెంది రాజకీయ కుటుంబమే. వారి కుటుంబమంతా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగింది. దివంగత ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి మనువరాలు. తండ్రి దివంగత చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి పీసీసీ సభ్యుడు. మేనమామ కుంభం శివకుమార్‌రెడ్డి డీసీసీ మాజీ అధ్యక్షుడు

మక్తల్ - నియోజకవర్గం

పేరు : వాకిటి శ్రీహరి
పుట్టిన తేదీ : 01.11.1972
తల్లిదండ్రులు : వాకిటి రాములమ్మ, నర్సింహులు
భార్య : లలిత
పిల్లలు : అచ్యుత్‌రాం, అమిత్‌సాయి
రాజకీయ నేపథ్యం : 1996 నుంచి 2001 వరకు కాంగ్రెస్ పార్టీ మక్తల్ మండల కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు. 2001 – 2006లో మక్తల్ మేజర్ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2014 – 2018 వరకు మక్తల్ జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికై .. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జెడ్పీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. 2014 – 2018 జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2022 నుంచి డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

మహబూబ్‌నగర్ - నియోజకవర్గం

పేరు : యెన్నం శ్రీనివాస్‌రెడ్డి,
తండ్రి పేరు : యెన్నం జానకిరాంరెడ్డి
భార్య : ప్రసన్నారెడ్డి **పిల్లలు:** ఆర్నవ్, అక్షర
స్వస్థలం : వెల్దండ
పుట్టిన తేదీ : 03.01.1970
విద్యార్హత : ఎంబీఏ, ఎంఏ, ఉస్మానియా యూనివర్సిటీ
రాజకీయ నేపథ్యం : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి 2001లో రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ మద్దతుతో 2007లో మహబూబ్‌నగర్–హైదరాబాద్–రంగారెడ్డి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2007– 2009 టీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. 2009లో కేసీఆర్ మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీచేసినప్పుడు ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. 2009లో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. యువ తెలంగాణ జేఏసీ ఫౌండర్‌గా పనిచేశారు. 2012లో మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో ఎన్నికల్లో మహబూబ్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఎర్రశేఖర్‌కు మద్దతు తెలిపారు. తిరిగి 2019 నుంచి 2023 వరకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కాంగ్రెస్‌లో చేరారు.

జడ్చర్ల - నియోజకవర్గం

పేరు : జనంపల్లి అనిరుధ్‌రెడ్డి
తండ్రి : జనుంపల్లి దిలీప్‌రెడ్డి **తల్లి :** శశికళారెడ్డి
భార్య : మంజూష గంగారం
స్వగ్రామం : రంగారెడ్డిగూడ, రాజాపూర్ మండలం
చదువు : బీటెక్ **పుట్టిన తేదీ :** 31.12.1980
రాజకీయ అరంగ్రేటం : 2012లో వైఎస్‌ఆర్‌సీపీలో చేరారు. 2017లో కాంగ్రెస్‌లో చేరి టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. తల్లి శశికళారెడ్డి రంగారెడ్డిగూడ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు.

వనపర్తి - నియోజకవర్గం

పేరు : జిల్లెల చిన్నారెడ్డి **పుట్టిన తేదీ :** 01.06.1955
స్వగ్రామం : జయన్న తిరుమలాపురం, గోపాల్‌పేట మండలం **తల్లిదండ్రులు :** పాపిరెడ్డి, దుర్గమ్మ
భార్య : రమాదేవి **పిల్లలు :** ఆదిత్యరెడ్డి, అనురాగ్‌రెడ్డి
విద్యార్హత : ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ (అగ్రికల్చర్), ఎల్‌ఎల్‌బీ
రాజకీయ నేపథ్యం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికై .. యూత్ కాంగ్రెస్ కోటాలో మొదటిసారి 1985లో వనపర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1989లో రెండోసారి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో ఓటమి, 1999, 2004లో వరుసగా రెండు సార్లు గెలుపొందారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో మంత్రి పనిచేశారు. 2009లో ఓటమి, 2014లో గెలుపొందారు. 2018లో ఓటమిపాలయ్యారు.

దేవరకద్ర - నియోజకవర్గం

పేరు : గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి **పుట్టిన తేదీ :** 04.05.1971
విద్యార్హత : బీఏ, ఎల్‌ఎల్‌బీ **భార్య :** కవిత
స్వగ్రామం : దమగ్నాపూర్, చిన్నచింతకుంట మండలం
రాజకీయ నేపథ్యం : న్యాయవాది వృత్తిలోనే కొనసాగుతూ జీఎంఆర్ సేవా సమితి పేరుతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2022 నుంచి మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఎవరికీ తలవంచను..

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు


మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: కేసీఆర్ వచ్చినా, ఆయన తాత వచ్చినా ఎవరికీ తలవంచే ప్రసక్తే లేదని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్‌లో ఈనెల 31న నిర్వహించనున్న ప్రియాంకగాంధీ సభపై శుక్రవారం పార్టీ నాయకులతో స్థానిక ఎస్‌ఎం గార్డెన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ప్రపంచంలో తెలుగు వారు ఎక్కడ ఉన్నా కొల్లాపూర్ పేరు చెబితే జూపల్లి కృష్ణారావు నియోజకవర్గం అని అంటారని, అది నా గొప్పతనం కాదు.. నా కార్యకర్తల గొప్పతనమని అన్నారు. కొల్లాపూర్‌తో తనకుకు అంత అనుబంధం ఉందన్నారు. డబ్బు సంచులు, అధికారం, పదవులు, టికెట్ల కోసం ఎవరికీ తలవంచలేదని తెలిపారు. తాను పోటీ చేసిన ప్రతిసారీ నియోజకవర్గ ప్రజలు గెలిపించారని, వచ్చే ఎన్నికల్లో కూడా గెలుపు ఖాయమన్నారు. ప్రియాంకగాంధీ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన సూచించారు. వచ్చే ఎన్నికలు జూపల్లికి, అమ్ముడుపోయిన, పారిపోయిన వ్యక్తికి మధ్య పోటీ అన్నారు. సమావేశంలో ఎన్నికల పర్యవేక్షకుడు పీవీ. మోహన్, ఏఐసీసీ ఓబీసీసెల్ జాతీయ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్, వనపర్తి డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాము యాదవ్, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ఉన్నారు.

లిక్కర్ పట్టివేత

గద్వాల క్రైం/అలంపూర్/ఖిల్లాఘనపురం/పెబ్బేరు రూరల్/గోపాల్‌పేట: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ, బెల్టుషాపుల్లో దాడులు నిర్వహించి భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు.

- గద్వాల మండలం వీరాపురం గ్రామానికి చెందిన బీచుపల్లి ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా, దాడి చేసి పట్టుకుని రూ.5వేల విలువగల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.
- అలంపూర్ పట్టణ సమీపంలో కర్నూల్‌కు చెందిన రతన్‌కుమార్ బైక్‌పై రూ.28,600 విలువగల మద్యం తరలిస్తుండగా.. స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.
- ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లిలో పిట్టల విష్ణు బెల్టుషాపుపై పోలీసులు దాడి నిర్వహించి, సుమారు 12.75 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.
- పెబ్బేరు మండలం చెలిమిల్లకు చెందిన మన్యం బెల్టుషాపుపై దాడులు నిర్వహించి, 12లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.
- గోపాల్‌పేట మండల కేంద్రంలోని చెన్నూరు రోడ్డులోగల బెల్టుషాపులో 19 క్వార్టర్ బాటిళ్లను పట్టుకుని, దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.


ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

భారీగా నగదు సీజ్


మాగనూర్‌లో నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

వనపర్తి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలిస్తున్న నగదును పట్టుకుని సీజ్ చేశారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ. 6.44 లక్షల నగదు, 22 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు. వనపర్తి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.1.28 లక్షలు, పెద్దమందడి పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.2.06 లక్షలు, పెబ్బేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.లక్ష, గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.లక్ష, ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.60వేల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు.

మాగనూర్: నారాయణపేట జిల్లా మాగనూర్ మండలం గజ్జరందొడ్డి గ్రామానికి చెందిన కుమ్మరి లింగప్ప తన బైక్‌పై రూ.లక్షా 30వేల నగదు తరలిస్తుండగా, ఉజ్జెల్లి సమీపంలోని చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ మన్నాన్ తెలిపారు.


బుద్ధారం చెక్‌పోస్టు వద్ద నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

శిక్షణకు హాజరు కాకపోతే చర్యలు

- నవంబర్ 2లోగా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల శిక్షణకు హాజరు కాని పీఓ, ఏపీఓలపై చర్యలు తప్పవని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి రోజు శిక్షణకు హాజరు కాని వారికి శనివారం ఒక అవకాశం ఇవ్వాలని, శిక్షణకు హాజరు కానట్లయితే షోకాజ్ నోటీస్ జారీ చేసి, సస్పెన్షన్ చేస్తామన్నారు. నవంబర్ 2వ తేదీలోగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితాపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కేటాయించే గుర్తులపై జాగ్రత్తలు పాటించాలన్నారు. అన్ని విషయాలు హ్యాండ్‌బుక్‌లో ఉన్నాయని, వాటిని గమనించాలని తెలిపారు. ఎన్నికల విధులకు నియమించిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ఫారం–12 అందజేయడంతో పాటు వాటిని తిరిగి తీసుకోవాలన్నారు. రెండవ ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో వివిధ అంశాలకు నోడల్ అధికారులను నియమించినట్లుగానే నియోజకవర్గ స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలని తెలిపారు. ఎన్నికల సందర్భంగా స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం, సీ విజిల్ ఫిర్యాదుల విభాగం ద్వారా వచ్చిన కేసులు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, ఆర్‌ఓలు అనిల్‌కుమార్, నటరాజు ఉన్నారు.


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

గులాబీ శ్రేణుల్లో జోష్

- అచ్చంపేట, వనపర్తిలో సీఎం కేసీఆర్ సభల సక్సెస్‌తో నూతనోత్సాహం
- అభ్యర్థుల గెలుపు వ్యూహాలపై అధినేత దిశానిర్దేశం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరులో సీఎం కేసీఆర్ పర్యటన గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. గురువారం అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన భారీ బహిరంగ సభలు విజయవంతం కావడంతో పార్టీ నాయకుల్లో జోష్ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సీఎం కేసీఆర్ పాలమూరు జిల్లాపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. గత పదిరోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల నిర్వహించిన బహిరంగ సభలకు సీఎం హాజరయ్యారు. ఈ నెల 18న జడ్చర్లలో, గురువారం ఒకేరోజు అచ్చంపేట, వనపర్తిలో బహిరంగ సభల్లో పాల్గొనడంతో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.

భారీ జనసమీకరణపై సంతృప్తి..
అచ్చంపేట, వనపర్తిలో నిర్వహించిన బహిరంగ సభలకు బీఆర్‌ఎస్ చేపట్టిన జనసమీకరణ పట్ల సీఎం కేసీఆర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎండలోనూ ఇంతమంది జనం వస్తారని ఊహించలేదంటూ కితాబిచ్చారు. అచ్చంపేటలో సుమారు 30 నిమిషాలు, వనపర్తి సభలో 20 నిమిషాల పాటు సీఎం ప్రసంగించారు. సభ అనంతరం ఎన్నికల్లో గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. త్వరలోనే ఉమ్మడి జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లోనూ సీఎం పర్యటనకు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సీఎం కేసీఆర్ బహిరంగ సభల నిర్వహణతో ఎన్నికల ప్రచారం జోరందుకుంది.

'పాలమూరు' ప్రచారాస్త్రం..
అధికార బీఆర్‌ఎస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాపై ఫోకస్ పెట్టింది. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవం ప్రధాన ప్రచారాస్త్రంగా ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రాజెక్టు మొదటి పంపును ప్రారంభించామని, త్వరలోనే ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇస్తోంది. ఇప్పటివరకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని, ఈసారి గెలిపిస్తే ప్రాజెక్టు ఫలాలను అందిస్తామని చెబుతోంది. ఈ ప్రాజెక్టు అనుసంధానంగానే అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్, పదర మండలాలకు ఉమామహేశ్వర ఎత్తిపోతల ద్వారా నీటిని అందిస్తామని ముమ్మరంగా ప్రచారం చేస్తోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన అనంతరం ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో సీఎం పర్యటించడంతో బీఆర్‌ఎస్ ప్రచారంలో ముందు వరుసలో నిలుస్తోంది.

అభివృద్ధి, సంక్షేమంపై భరోసా..
వరుసగా మూడోసారి అధికారం చేపట్టడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పావులు కదుపుతుండగా.. ప్రధానంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు, లబ్ధిదారులపైనే ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. ప్రతి నియోజకవర్గంలోనూ పెద్ద సంఖ్యలో ఉన్న లబ్ధిదారులు తమకు అండగా ఉంటారని భావిస్తోంది. నియోజకవర్గాల్లోని గ్రామాలు, వార్డుల వారీగా రైతుబంధు, బీమా, పింఛన్లు, ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారుల జాబితాను లెక్కలు వేస్తోంది.


అచ్చంపేట సభకు హాజరైన జనం

నేడు ఆలయ ఉద్యోగిపై విచారణ

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ ఆలయంలో సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ విధి నిర్వహణలో ఉంటూ పలు ఆరోపణలపై ఆగస్టు 16న సస్పెండ్‌కు గురయ్యారు. ఈయనపై శనివారం దేవదాయశాఖ అధికారులు విచారణ చేయనున్నారు. ఈమేరకు జిల్లా దేవదాయ శాఖ సూపరింటెండెంట్, పాలెం దేవస్థానం ఈవోలను దేవదాయశాఖ విచారణ అధికారులుగా నియమించింది. ఇదిలా ఉండగా ఆలయ ఉద్యోగి సస్పెండ్ కాగానే సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉండగా సంబంధిత అధికారులు ఆర్డర్‌ను నమోదు చేయలేదు. సస్పెండ్‌కు గురైన ఉద్యోగి ఉన్నతాధికారిని కలిసి తనను కాపాడాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

కాల్వలో పడి వ్యక్తి మృతి

ధరూరు: మండల కేంద్రంలోని మన్నాపురం వెళ్లే దారిలో రైల్వే ట్రాక్ పక్కనున్న నెట్టెంపాడు డిస్ట్రిబ్యూటరీ కాల్వలో పడి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని అల్వాలపాడుకు చెందిన బంట్రోతు హనుమంతు(48) వ్యక్తిగత పని మీద మధ్యాహ్నం మండల కేంద్రానికి వచ్చాడు. సాయంత్రం కాల్వలో శవమై కనిపించడంతో అటుగా వెళ్తున్న రైతులు, కూలీలు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా.. అదే సమయంలో మండలంలో ప్రచార పర్యటనకు వెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బండ్లలక్ష్మీదేవి సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి..

మహబూబ్‌నగర్ క్రైం: యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మండలంలోని పోతన్‌పల్లికి చెందిన రేణుక(26) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతిపై సోదరుడు పరశురాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త చిన్నశ్రీశైలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

నీటి సంపులో పడి బాలుడు..

నాగర్‌కర్నూల్ క్రైం: నీటి సంపులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉయ్యాలవాడకి చెందిన అనదీప్(3) ఇంట్లో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి మృతిచెందాడు. తల్లిదండ్రులు నరేష్, సంధిని బాలుడు అనదీప్ కనపడకపోవడంతో వెతుకుతూ సంపులో చూడగానే బాలుడు మృతిచెందినట్లుగా గుర్తించారు. బాలుడి మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నవాబుపేట: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొత్తపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జోగు ఎల్లయ్య(45) గురువారం రాత్రి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్లయ్య తన కూతురు పెళ్లికి అప్పులు చేశాడు. అలాగే తన ఇంటి సమీపంలో గల స్థలం సైతం అమ్మిన చేసి తన ఇద్దరు పిల్లల కోసం కొనుగోలు చేశాడు. అప్పులు తీర్చలేక మనస్తాపం తో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అనంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

ఇంట్లో నగదు చోరీ

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి నగదు అపహరించిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని సాయి హోం కాలనీకి చెందిన ఉమాదేవి కుటుంబసభ్యులతో కలిసి పది రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం ధ్వంసం చేసి బీరువాలోని రూ.30 వేల నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మటన్నపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

మహిళ బలవన్మరణం

పెబ్బేరు: ఉరివేసుకుని మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని భగీరాన్‌పల్లికి చెందిన దర్పల్లి ఇద్దరు భార్యలు ఉన్నారు. ఆయన ప్రథమ భార్య నర్సక్క ఇద్దరు వదిలేశారు. అప్పటి నుంచి దర్పల్లి మద్యానికి బానిసై, డబ్బుల కోసం అక్క వెంకటమ్మతో గొడవపడి, వేధింపులకు పాల్పడేవాడు. అక్క డబ్బులు ఇవ్వకపోవడంతో పురుగుల దర్పల్లి పురుగుల మందు తాగాడు. వెంటనే అతన్ని చికిత్స కోసం మక్తల్‌కు తరలించారు. అక్క వెంకటమ్మ భయపడి ఇంట్లో ఉన్న పైపులకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దర్పల్లి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని పోలీసులు తెలిపారు. మృతి చెందిన వెంకటమ్మను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. మృతురాలి కూతురు అవుస్థ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వర్షకాలు తెలిపారు.

మూగబోనున్న గుడిగంటలు

- నేడు చంద్రగ్రహణం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29న ఉదయం నుంచి తెరుచుకోనున్న ఆలయాలు


అలంపూర్ జోగుళాంబ ఆలయం

జోగుళాంబ శక్తిపీఠం: రాహుగ్రస్త ఖండ గ్రాస చంద్రగ్రహణం ఉండటంతో శనివారం మధ్యాహ్నం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు మూసివేయనున్నారు. దీంతో గుడిగంటలు, మంగళవాయిద్యాలు మూగబోనున్నాయి. జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం, శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలు శనివారం సాయంత్రం 5 గంటలకు మూసివేసి మరుసటి రోజు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి తెరుస్తున్నట్లు ఆలయ అధికారి పురేందర్‌కుమార్, ముఖ్య అర్చకుడు ఆనంద్ శర్మ తెలిపారు. మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం 28వ తేదీ సాయంత్రం 4గంటలకు మూసివేస్తుండగా గంగాపురం చెన్నకేశవస్వామి ఆలయం మధ్యాహ్నం 3 గంటలకు మూసివేయనున్నారు. అచ్చంపేట ఉమామహేశ్వరస్వామి దేవాలయం 28వ తేదీ సాయంత్రం 3:30 గంటలకు మూసివేస్తున్నారు. కురుమూర్తి దేవస్థానం సాయంత్రం 5 గంటలకు మూసివేస్తుండగా, మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం మధ్యాహ్నం నైవేద్యం అనంతరం 1 గంటకు మూసివేస్తున్నారు. బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆలయం సాయంత్రం 6 గంటలకు బంద్ చేస్తున్నారు. మల్దకల్ లక్ష్మీవేంకటశ్వర స్వామి ఆలయం సాయంత్రం 5 గంటలకు మూసివేస్తుండగా, చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం సాయంత్రం 5 గంటలకు మూసివేయనున్నారు. దేవరకద్ర మండలం చిన్న రాజమూరు ఆంజనేయస్వామి ఆలయం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి మూసివేస్తుండగా, వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపురం రంగనాథస్వామి ఆలయం మధ్యాహ్నం 4 గంటల నుంచి మూసివేయనున్నారు. సింగోటం నరసింహ స్వామివారి ఆలయం మధ్యాహ్నం 3 గంటల నుంచి మూసివేస్తున్నారు.

■ ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఆలయాలన్నీ మధ్యాహ్నం మహానివేదన అనంతరం మూసివేసి మరుసటి రోజు ఉదయం తలుపులు తీయనున్నారు. 28వ తేదీ పౌర్ణమి ఉండటంతో పలు ఆలయాల్లో చండీహోమాలు, అన్నదానాలు ఉండటంతో మధ్యాహ్నం వరకు పూర్తి చేసుకుని సూర్యాస్తమయం కాకముందే మూసివేస్తున్నారు.

భక్తులు సహకరించాలి



గ్రహణం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని అన్ని ఆలయాలను ప్రదోశ కాలంలోపుగా అక్కడి ప్రాంతీయ ఆచారాలను పాటిస్తూ వివిధ సమయాలలో మూసివేస్తున్నారు. ఈ విషయాన్ని ఆలయాల వద్ద ముందస్తుగానే నోటీసు బోర్డు ద్వారా భక్తులకు సమాచారం అందించారు. భక్తులు ఆలయాల సమయ పాలనకు సహకరించాలి.

– శ్రీనివాస్‌రాజు, దేవదాయశాఖ సహాయ కమిషనర్

జపతపాలు చాలా మంచిది



శనివారం రాత్రి 1:08గంటల నుంచి 2:37 గంటల వరకు సంభవించే చంద్రగ్రహణంలో అనుష్ఠాన పరులు జపతపాలు ఆచరిస్తే మంచిది. లేని పక్షంలో మరుసటి రోజు 29వ తేదీ ఆదివారం భక్తులకు అందుబాటులో ఉన్న ఆలయాలనున దర్శించి అక్కడి బ్రాహ్మణులకు చంద్రుడికి సంబంధించిన బియ్యం, నెయ్యి, దానాలు చేసినా గ్రహణం దోషాలు తొలగుతాయని శాస్త్ర వచనం.

– ఆనంద్ శర్మ, అర్చక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

దేవీ శరన్నవరాత్రుల ఆదాయం రూ.30,07,460


ఆదాయ వివరాలు వెల్లడిస్తున్న ఈఓ పురేందర్‌కుమార్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన జోగుళాంబ దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు రూ.30,07,460 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన దేవస్థానం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉండటంతో ఈ ఏడాది రాజకీయ ప్రముఖులు పెద్దగా ఎవరు రాలేదన్నారు. అయినప్పటికీ సామాన్య భక్తులు అధికంగా వచ్చారన్నారు. గతేడాది రూ.22,86,943 రాగా.. ఈ ఏడాది రూ.30,07,460 ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఏడాది విద్యుత్ అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల ను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. తుంగభద్ర నదిలో నీరు తక్కువ ఉన్నప్పటికీ సాంప్రదాయాన్ని నిలబెట్టేందుకు మరబోటులో చిన్నహంస వాహనంపై తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించామన్నారు.

మటన్ ముక్క గొంతులో ఇరుక్కొని బాలుడు మృతి


సేనావత్ మున్నా (ఫైల్)

బాలానగర్: మటన్ ముక్క గొంతులో ఇరుక్కొని ఓ బాలుడు మృతిచెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం ఉడిత్యాల పంచాయతీ మమిడిగుట్టతండాలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. దసరా ఉత్సవాల్లో భాగంగా లంబాడీలు తుల్జాభవాని, పోచమ్మ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ క్రమంలో తండాకు చెందిన సేనావత్ లక్ష్మణ్, జ్యోతి దంపతుల కుమారుడు సేనావత్ మున్నా(12) గురువారం రాత్రి మటన్ తింటూ ఉండగా ఉండిలో వచ్చిన మేక కణ్ను గుడ్డును గమనించకుండా మింగేశాడు. దీంతో బాలుడి గొంతులో ఇరుక్కుని ఊపిరి ఆడకపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మున్నా హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. నాలుగు రోజులక్రితమే బతుకమ్మ సెలవుల్లో తండాకు వచ్చాడు. బాలుడి తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ ఘటనతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పెస్టిసైడ్ దుకాణదారుడిపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న ఓ షాపు యజమానిపై శుక్రవారం ఇటిక్యాల పీఎస్‌లో కేసు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సాతర్లలో ఓ పెస్టిసైడ్ షాపులో శుక్రవారం ట్రూ బడ్డీ కన్సల్టింగ్ కంపెనీకి చెందిన అధికారులు ఓ కంపెనీకి చెందిన పురుగు మందును కొనుగోలు చేశారు. దానిపై ఉన్న స్కానర్‌ను కంపెనీ ఆప్‌లో పరిశీలించగా.. అది నకిలీ పురుగు మందు అని తేలింది. దీంతో షాపు యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ట్రూ బడ్డీ కంపెనీ సీనియర్ అసిస్టెంట్ కేశవ సుదీర్ ఫిర్యాదు మేరకు షాపు యజమాని తిమ్మారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మిడ్జిల్: మండల పరిధిలోని వాడ్యాల్ స్టేజీ వద్ద శుక్రవారం మధ్యాహ్నం రోడ్డు దాటుతున్న వ్యక్తిని, కల్వకుర్తి వైపు వెళ్తున్న స్కూటీ ఢీకొంది. ఘటనలో వాడ్యాల్‌కి చెందిన బయ్యాలు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. అదే విధంగా స్కూటీపై ఉన్న పైన బాలానగర్ మండల పరిధిలోని తిరుమలాపూర్‌కు చెందిన ప్రశాంత్ సైతం తీవ్రగాయాలు అయినట్లు వివరించారు. ఇద్దరిని చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 1,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 122 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,773 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.585 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

నిండుకుండలా రామన్‌పాడుజలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,140 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 1140 క్యూసెక్కులు నీటి పంపింగ్ నిలిపివేశారు. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 1,150, కుడి కాల్వకు 15, ఎడమ కాల్వకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

మాచారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల ఘర్షణ


మాచారంలో తోపులాడుకుంటున్న ఇరుపార్టీల నాయకులు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య శుక్రవారం ఉదయం స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బీఆర్ఎస్ నుంచి ఐటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గ్రామానికి వచ్చి సదరు వ్యక్తితో మాట్లాడి తిరిగి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అయితే తమ పార్టీలో ఉన్న వ్యక్తిని బలవంతంగా చేర్చుకోవడం ఏమిటని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. దీంతో మాటామాట పెరిగి రెండు పార్టీల కార్యకర్తల ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో స్వల్ప ఘర్షణ జరిగి ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. వెంటనే అమ్రాబాద్ ఎస్ఐ వీరబాబు, పోలీసులు ఇరువర్గాలను సముదాయించి గొడవ సద్దుమణిగేలా చేశారు. అనంతరం ఒకరిపై ఒకరు అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

లభించని యువతి ఆచూకీ

ధరూరు: మండలంలోని దోర్నాలకు చెందిన నారాయణ కుమార్తె అరుణ కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఉంటుంది. గురువారం మధ్యాహ్నం నుంచి ఆ యువతి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయా ప్రాంతాల్లో వెతికారు. శుక్రవారం తెల్లవారుజామున 6 గంటల సమయంలో ఓ యువతి కాల్వలో పడినట్లు అటుగా వ్యవసాయ పొలాలకు వెళ్తున్న కొందరు రైతులు అనుమానం వ్యక్తం చేస్తూ.. తెలియజేశారు. అదే సమయంలో దోర్నాల గ్రామస్తులు అమ్మాయిని వెతకడానికి రాగా.. కాల్వ లో ఎవరో దూకారనే విషయం తెలియడంతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం పొద్దుపోయే వర కు గాలించినా ఆచూకీ లభించలేదు. తిరిగి శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నారు.

పత్తి దగ్ధం



బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్‌కు చెందిన కాంతయ్య వ్యవసాయ పొలంలో నిల్వ చేసిన 75 బస్తాల పత్తి గురువారం రాత్రి దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. మూడు రోజుల కిందట కాంతయ్య తన పొలంలో ఏరిన పత్తిని దాదాపు 75 బస్తాల్లో నింపి అక్కడే రేకుల షెడ్‌లో భద్రపరిచాడు. గుర్తుతెలియని దుండగులు పత్తి బస్తాలకు నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయింది. దాదాపు 23 క్వింటాళ్ల పత్తి కాలి బూడిదయిందని రైతు వాపోయాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఎమ్మెల్సీ కూచుకుళ్లకు నాగం బహిరంగ లేఖ

కందనూలు: ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డికి నాగం జనార్దన్‌రెడ్డి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీగా ఉంటూ పార్టీకి, పదవికి రాజీనామా చేయకుండా ద్రోహించిన తన కొడుకును కాంగ్రెస్ పార్టీలోకి పంపించి పార్టీ టికెట్ దక్కించుకున్నారని విమర్శించారు. మీరు, మీ కుమారుడు రాజేష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు ఏంటో కార్యకర్తలు, ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మనుగడలో లేని బీఆర్ఎస్‌కు రిజైన్ ఎలా చేస్తారో చెప్పాలని.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉంటూ.. కాంగ్రెస్‌కు ఓటేయాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. మనుగడలో లేని బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు, బీఆర్ఎస్ అధ్యక్షుడు కే.చంద్రశేఖర్‌రావుకు రాజీనామా లేఖ పంపిస్తారా? ఇదేనా మీ నైతికత అని ప్రశ్నించారు. విలువలు ఉంటే ముందు ఎమ్మెల్సీ పదవికి శాసన మండలి ఛైర్మన్(స్పీకర్) ఫార్మాట్‌లో రాజీనామా చేయాలన్నారు. విలువలకు తిలోదకాలు ఇచ్చిన మీకు నియోజకవర్గంలో ఆదుగు పెట్టే హక్కు లేదని తెలిపారు. ఆరేళ్లుగా పార్టీని, కార్యకర్తలను కాపాడుకుంటూ వస్తున్న తనని కాదని, నిజాయితీ లేని వ్యక్తులకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్ అమ్ముకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

ఆయకట్టు రైతులను ఆదుకుందాం

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులకు సమస్యలపై విన్నవం

శాంతినగర్: ఆర్డీఎస్ కెనాల్ కింద పంటలు సాగు చేసిన రైతులను ఆదుకునే విషయమై ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. ఆర్డీఎస్ రైతుల సమస్యలు, పంటలు ఎండుతున్న విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యలు విన్నవించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల తుంగభద్ర డ్యాంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున సగానికి ఇండెంట్ తగ్గించారని, ఆర్డీఎస్ కెనాల్ అధికారులు ఇండెంట్ పెంచితే కొట్టిపాటి నీరు నదిలో ఇంకిపోతుందని, కర్ణాటక పరిధిలోని పొలాలకు మాత్రమే నీరందుతున్నాయని అలంపూర్ నియోజకవర్గంలోని ఆయకట్టుకు నీరు రావడం లేదని సీఎంకు వివరించారు. కేసీ కెనాల్, ఆర్డీఎస్ అధికారులు ఇరువురు ఇండెంట్ పెడితే కేసీ కెనాల్, ఆర్డీఎస్ రైతులకు సాగునీరు అందుతుందని వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ నీటి పారుదలశాఖ అధికారులు, ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ఇరు రాష్ట్రాల అధికారులు ఇండెంట్ పెడితే బాగుంటుందని చెప్పగా ఏపీ సీఎం అంగీకరించినట్లు ఎమ్మెల్సీ వివరించారు. వెంటనే ఏపీ సీఎస్ ధనుంజయరెడ్డికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ చేసి తెలంగాణ నీటి పారుదలశాఖ అధికారులు ఒకేసారి ఇండెంట్ పెట్టి రైతులకు సాగునీరందించాలని సూచించారు. ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆదేశాలతో ఆర్డీఎస్, కేసీ కెనాల్ అధికారులు ఒకేసారి ఇండెంట్ పెడతారని ఎమ్మెల్సీ తెలిపారు. రెండు రాష్ట్రాల అధికారులు ఒకేసారి ఇండెంట్ పెడితే తుంగభద్రనదిలో నీరు రేపే తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్లకు నీరందుతాయని, తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు నీరందుతుందని ఎమ్మెల్సీ తెలిపారు.

కేఎల్ఐ ప్రధాన కాల్వకు గండి

మూడు గ్రామాలకు నిలిచిన సాగునీరు


కోడేరు శివారులో తెగిపోయిన కేఎల్ఐ ప్రధాన కాల్వ

కోడేరు: మండల కేంద్రం సమీపంలోని నర్సింహ వ్యవసాయ పొలం వద్ద ఎంజీకేఎల్ఐ ప్రధాన కాల్వకు గండి ఏర్పడి తెగిపోయింది. జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి అధికారులు కాల్వకు నీళ్లు వదలగా, గురువారం అర్ధరాత్రి నీటి ప్రవాహం ఎక్కువ అయి గండి ఏర్పడింది. దీంతో ఎత్తం, మహసముద్రం, కొండ్రావుపల్లి, కోడేరు రైతులకు సాగునీరు నిలిచిపోయింది. కేఎల్ఐ అధికారులు రెండు రోజుల కిందట సాగునీరు అధికంగా వదలడంతో నీటి తాకిడికి కాల్వలు తెగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. నీటి సామర్థ్యం తగ్గించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా లాభం లేకుండా పోయిందని, తరుచూ కాల్వలు తెగిపోతుండటంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏఈ లక్ష్మిని వివరణ కోరగా, తెగిపోయిన కాల్వకు నీటి సామర్థ్యం తగ్గిస్తామని, వెంటనే మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు.

ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తాం

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్ఎం శ్రీదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్ఎం ద్వారా ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించి ప్రయాణికుల నుంచి ఆర్టీసీ సంబంధించిన ఫిర్యాదులను తీసుకున్నారు. మహబూబ్‌నగర్ నుంచి భూత్పూర్, జడ్చర్ల వరకు సిటీ బస్సులు నడపాలని, నారాయణపేట నుంచి మరికల్, ఆత్మకూర్ వరకు, నవాబుపేట, మరికల్ సర్వీసును కొత్తపల్లి వరకు పొడిగించాలని ప్రయాణికులు ఫోన్‌లో కోరారు. గద్వాల–అయిజ–రాయచూర్, కర్నూల్–అయిజ వరకు వరకు అదనపు ట్రిప్పులు నడపాలని, ఉండ్యాల మీదుగా మరికల్–ఆత్మకూర్ షటిల్ సర్వీసును, నాగర్‌కర్నూల్ నుంచి లింగాల–పెద్దకొత్తపల్లి–అంబటిపల్లి నైట్‌హాల్ట్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరారు.

నేడు కల్వకుర్తిలో రీజియన్ అవార్డుల ప్రదానం

కల్వకుర్తి డిపోలో శనివారం జూలై నుంచి సెప్టెంబర్ త్రైమాసిక రీజియన్ స్థాయి అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సత్కరించెట్టుతో సన్మానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం నాయక్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. అదే విధంగా హైదరాబాద్ (నాన్‌స్టాప్) ప్రయాణికులకు సౌకర్యార్థం ఏర్పాటు చేసిన డీలక్స్ లాంజ్‌ను ఈడీ ప్రారంభిస్తారని తెలిపారు.

29న జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ త్రైక్వాండో ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 29న అండర్–14, అండర్–17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలబాలికల జిల్లాస్థాయి త్రైక్వాండో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయని, పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం త్రైక్వాండో కోచ్ సురేందర్‌బాబు (9966480704)ను సంప్రదించాలని ఆయన కోరారు.

జడ్చర్లలో ఫుట్‌బాల్ ఎంపికలు

అండర్–14, అండర్–17 విభాగాల బాల, బాలికల ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపికలను ఈనెల 29న జడ్చర్లలోని బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. మిగతా వివరాల కోసం పీఈటీ మోయిన్ (9985375737)ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటాలి


ఆర్చరీ క్రీడాకారులతో డీవైఎస్ఓ ఎస్.శ్రీనివాస్

- జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా యోగా, ఆర్చరీ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి విజేతలుగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్‌స్టేడియంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అండర్–14, అండర్–17 యోగా, ఆర్చరీ ఎంపికలు నిర్వహించారు. ఎంపికల్లో డీవైఎస్ఓ పాల్గొని మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పట్టుదలతో ఆడి విజయం సాధించాలని కోరారు. క్రీడల్లో నిరంతరం సాధన చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అండర్–19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి, అండర్–14, అండర్–17 విభాగాల జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు, సహాయ కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి జియావుద్దీన్, రిటైర్డ్ పీడీ రాంచందర్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విలియం, నర్సింలు, శరత్, రాములమ్మ, బాలమణి, బాల్‌రాజు, ఆర్చరీ కోచ్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు గుర్తించుకోవాలి

డీఐజీ ఎల్ఎస్ చౌహాన్


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఐజీ చౌహాన్

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఎస్పీ కార్యాలయం దగ్గర జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ప్రారంభించారు. ర్యాలీ ఎస్పీ కార్యాలయం నుంచి క్లాక్‌టవర్, అశోక్ టాకీస్ చౌరస్తా, బస్టాండ్, సుభాష్ చంద్రబోస్ చౌరస్తా, డీఈఓ కార్యాలయం మీదుగా ఎస్పీ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ పోలీసులు శాంతిభద్రతల రక్షణ కోసం 24 గంటలు కృషి చేస్తారన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ఈ సైకిల్ ర్యాలీలో ఎస్పీ హర్షవర్ధన్, ఏఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీలు టి.మహేష్, శ్రీనివాసులు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.